ప్రజాశక్తి
శుక్రవారం 17 ఫిబ్రవరి 2023
5
పార్వతీపురం మన్యం

బ్యాలెట్ బాక్సుల పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఎమ్మెల్సీ ఎన్నికలకు వినియోగించేందుకు కలెక్టరేట్‌లో భద్రపర్చిన బ్యాలెట్ బాక్స్‌లనుకలెక్టర్ నిశాంత్ కుమార్ గురువారం పరిశీలించారు. ఎన్నికల అధికారులతో బ్యాలెట్ బాక్స్‌లను ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాటు చేసే బస్‌లను ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నిలిపేలా చర్యలు తీసుకోవాలని డిఆర్‌ఒ జె.వెంకట్రావును ఆదేశించారు. ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను తాత్కాలికంగా భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూం ఏర్పాటుకు అవసరమైన చర్యలను చేపట్టాలని సూచించారు. బ్యాలెట్ బాక్స్‌లు భద్రతకు విశాఖ పంపేందుకు అవసరమైన చర్యలు, బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు పక్కాగా ఏర్పాట్లు ఉండాలని ఆయన అన్నారు.

సందడిగా రమాప్రభ నామినేషన్

- తరలివచ్చిన ప్రజాసంఘాల నాయకులు, పట్టభద్రులు
- పిడిఎఫ్ అభ్యర్థి గెలుపు... ఉత్తరాంధ్ర మలుపు : వక్తల ఉద్ఘాటన
- ప్రజల గొంతుకనవుతా : పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ

ర్యాలీలో పాల్గొన్న నాయకులు, పట్టభద్రులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఒకటే ఉత్సాహం.. ఉత్తేజం. ఉత్తరాంధ్ర ప్రజల గొంతులు ఒక్కసారిగా.. ఒక్కటై నినదించాయి. 'పిడిఎఫ్ గెలుపు.. ఉత్తరాంధ్ర ఉద్యమాల గెలుపు' అంటూ హోరెత్తాయి. మహిళల కోలాటాలు, యువత తీన్‌మార్ డోలు చప్పుళ్లు.. కేరింతలు, నృత్యాలతో విశాఖ నగరం గురువారం కొత్త ఎన్నికల ఉత్సాహాన్ని సంతరించుకుంది. ఉత్తరాంధ్ర ప్రాంత వెనుకబాటుతనంపై ప్రశ్నించేందుకు ప్రజల గొంతుకై ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థిగా పోటీ చేస్తోన్న విద్యాధికురాలు, సామాజిక కార్యకర్త డాక్టర్ కోరెడ్ల రమాప్రభ నామినేషన్‌కు గురువారం ఉదయం విశాఖకు ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ప్రజాసంఘాలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పట్టభద్రులు, మహిళలు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో వచ్చి కదంతొక్కారు. భారీ ర్యాలీ, కలెక్టరేట్ వద్ద సభలో వందల మంది పాల్గొన్నారు. ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ కావాలని, ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించాలని, స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలని, రైల్వే జోన్ సాధన అవసరమని.. ఇలా సమస్య ఎక్కడ ఉంటే అక్కడ పరిష్కారం కోసం జరిగే పోరాటాలకు అండగా ఉండే పిడిఎఫ్ అభ్యర్థి గెలుపుకోసం పెద్దపెట్టున నినదిస్తూ విశాఖ రోడ్లపై వందలాది మంది ముందుకు సాగారు. డాబాగార్డెన్ సరస్వతీ పార్కు నుంచి జగదాంబ జంక్షన్ మీదుగా ఈ భారీ ర్యాలీ జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకూ సాగింది. 250కు పైగా ప్రజా సంఘాలు బలపరుస్తున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ రమాప్రభకు వివిధ తరగతుల నుంచీ మద్దతు లభించింది. తొలుత అంబేద్కర్, తర్వాత తెన్నేటి, మదర్ థెరిసా విగ్రహాలకు పూలమాల వేసిన తర్వాత ర్యాలీ ఆరంభమైంది. గడచిన ఆరేళ్లుగా బిజెపి ఎమ్మెల్సీ పివిఎన్. మాధవ్ ఒక్క ప్రజా సమస్యనూ పరిష్కరించలేదని, పైగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిస్సిగ్గుగా సమర్థించుకున్నాడంటూ ర్యాలీ సందర్భంగా సాధారణ జనం మండిపడ్డారు. కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కారు విభజన హామీ చట్టంలోని ఏ ఒక్క అంశాన్నీ ఆంధ్రప్రదేశ్‌కు, ఉత్తరాంధ్రకు అమలు చేయకుండా తీవ్ర ద్రోహం చేస్తోందంటూ పలువురు ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, చిత్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, అజశర్మ

నిరంతర పోరాటశీలి పిడిఎఫ్ : వక్తలు

నామినేషన్ దాఖలు చేసే ముందు కలెక్టరేట్ వద్ద 250 ప్రజా సంఘాలు సహా పిడిఎఫ్ సంయుక్తంగా సభ నిర్వహించాయి. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, రైతులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం మండలి బయటా, లోపలా పోరాడుతున్నామన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై పిడిఎఫ్ అభ్యర్థిగా నిలబెట్టిన డాక్టర్ కె.రమాప్రభకు అవగాహన ఉందన్నారు. మరో పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో కోట్లకు పడగలెత్తే వారు ఓట్లు కోసం వస్తున్నారని, వారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. పోరాడే వారిపై ఈ సర్కారు కక్ష కట్టిందని, ఉపాధ్యాయులు, ఉద్యోగులపై పెటీ కేసులు పెట్టడం సిగ్గుచేటని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ గడచిన ఆరేళ్లలో ఉత్తరాంధ్ర నుంచి పిడిఎఫ్ అభ్యర్థి మండలిలో లేనందున స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు బిజెపి ఒడిగట్టిందని, రైల్వే డివిజన్ పోయిందని, వస్తుందనుకున్న జోన్ రాకుండా కేంద్రం దొంగ నాటకాలతో కాలం నెట్టుకొస్తుందంటూ మండిపడ్డారు. పిడిఎఫ్ లేకపోతే విశాఖ, ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఎంత అన్యాయం జరిగిందో చదువుకున్న వారంతా గుర్తించారన్నారు. తాజాగా అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారు ఎమ్మెల్సీగా పోటీచేస్తూ 'ఓట్లేయండి.. సేవ చేస్తాం' అంటూ పట్టభద్రుల ఓట్లను అడుక్కుంటున్నారని, గడచిన 30 ఏళ్లుగా ఉత్తరాంధ్రలో వివిధ తరగతుల ప్రజలకు రమాప్రభ సేవలందిస్తున్నారని శర్మ గుర్తుచేశారు.

పెద్ద సంఖ్యలో ఉద్యమ, ప్రజా సంఘాల నేతలు హాజరు

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అధ్యక్షతన సాగిన సభలోనూ, రమాప్రభ నామినేషన్ ర్యాలీలోనూ ఉద్యమ నేతలు సిహెచ్.నర్సింగరావు, కె.లోకనాథం, ఎం.జగ్గునాయుడు, డాక్టర్ బి.గంగారావు, తమ్మినేని సూర్యనారాయణ, రెడ్డి వేణు, గోవిందరావు, అప్పలనర్స, ఎం.పైడిరాజు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రకు రూ.24 వేల కోట్లకు గాను రూ.450 కోట్లే వచ్చాయి : రమాప్రభ

ఉత్తరాంధ్ర వెనుకబాటుతనంపై ప్రశ్నించే గొంతులు మూగబోతున్నాయని, ఎపి విభజన హామీ చట్టం ప్రకారం ఈ ప్రాంతానికి రూ.24 వేల కోట్లు నిధులు అభివృద్ధి కోసం రావాల్సి ఉండగా కేవలం రూ.450 కోట్లే వచ్చాయని పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తానని మోసం చేసిందన్నారు. ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేస్తానని చెప్పి మూడున్నరేళ్లయినా మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమాలకు, రైల్వే జోన్ సాధనకు సాగుతున్న పోరాటాలకు అండగా ఉంటానన్నారు.

నర్సిపురంలో రోడ్డుపై ధాన్యం బస్తాలతో నిరసన తెలుపుతున్న రైతులు

ధాన్యం కొనుగోలు చేయాలని

రోడ్డుపై అన్నదాత ఆందోళన

ప్రజాశక్తి - వీరఘట్టం

ఆరుగాలం తాము కష్టించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మండలంలోని నర్సిపురం, చలివేంద్రి గ్రామాలకు చెందిన రైతులు రహదారిపై ధాన్యం బస్తాలు వేసిన తమ నిరసనను తెలిపారు. చలివేంద్రిలో కలెక్టర్‌ను అడ్డుకొని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే నర్సిపురంలోనూ అన్నదాతలు రోడ్డుపై ధాన్యం బస్తాలు వేసి రాస్తారోకో చేశారు. ధాన్యం కొనేవారే లేరా? రైతుల కష్టం ఎవరికీ తెలియదా? తమ కాయకష్టం పశువుల, పందుల పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వరి నూర్పులైన మూడునెలలుగా కళ్లాలోనే ధాన్యం ఉన్నాయని, తమ మాగోడు ఎవరికి చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతలో పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు జియ్యమ్మవలస పర్యటనకు వెళ్తుండగా, రాస్తారోకోతో ట్రాఫిక్‌లో ఆయన వాహనం నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న డిఎస్‌పి రైతుల వద్దకు వచ్చి రోడ్డుపై వేసిన బస్తాలు తొలగించాలని రైతులకు చెప్పినప్పటికీ వినిపించుకోలేదు. బస్సులో ఉన్న గర్భిణులను పంపించాలని రైతులకు విన్నవించినా సమస్య పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేశారు. మూడు నెలల కిందట 44 కిలోల ధాన్యం తూనికలు వేస్తే 38 కిలోల ధాన్యం ఉంటున్నాయని తమ ఆవేదన ఎవరికి తెలియజేయాలని డిఎస్‌పి వద్ద రైతులు వాపోయారు. ఏడాదికి ఒక్కసారే వరి పంట సాగు చేస్తున్నామని, ఆ పంట తప్ప మరి ఏ పంటలు కూడా పండడం లేదని, రైతుగా పుట్టడమే నేరమా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా ధాన్యం కొనుగోలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతలో స్థానిక ఎస్ఐ ఎం.హరికృష్ణ గ్రామానికి చేరుకుని రోడ్డుకు అడ్డంగా ఉన్న ధాన్యం బస్తాలు తొలగించి యధావిధిగా వాహన రాకపోకలు కొనసాగించారు.

గ్రంథాలయ సెస్ వసూలుకు చర్యలు

సాలూరు : ఉమ్మడి జిల్లాల్లో మున్సిపాలిటీల నుంచి వసూలు కావాల్సిన గ్రంథాలయ సెస్ వసూలుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి చెప్పారు. గురువారం ఆమె గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లలితకుమారితో కలిసి మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత సెక్షన్ అధికారికి వినతి అందజేశారు. స్థానిక గ్రంథాలయంతో పాటు బొబ్బిలి, పార్వతీపురం, కొమరాడ గ్రంథాలయాలను తనిఖీ చేశారు. మున్సిపాలిటీల నుంచి సంస్థకి రావాల్సిన సెస్ వసూలుకు సంబం ధించిన అధికారులతో మాట్లాడారు. గ్రంథాలయాలకు సొంత భవనం నిర్మాణానికి పట్టణాల్లో స్థలాలు కేటాయించాలని కోరినట్లు చైర్ పర్సన్ పద్మావతి తెలిపారు. వీరి వెంట స్థానిక గ్రంథాలయాధికారి రాధాదేవి వున్నారు.

వినతిని అందజేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ పద్మావతి

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

లక్ష్యం మేరకు పనులు పూర్తి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్ రెడ్డి గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ కార్యక్రమాలను సమీక్షించారు. అనంతరం కలెక్టరు జిల్లా అధికారులతో సమీక్షిస్తూ నిర్మాణ పనులకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. రీ-సర్వే, భూసేకరణ, మ్యుటేషన్స్, వ్యవసాయ రంగానికి సంబంధించి రబీ కాలానికి ఇ-క్రాప్ బుకింగు, బిందుసేద్యం, పాలవెల్లువ, చేయూత, గృహ నిర్మాణం పథకాల లక్ష్యాలను పూర్తిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో జెసి ఒ.ఆనంద్, డిఆర్‌ఒ జె. వెంకటరావు, పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గృహ సారథులే సంక్షేమ వారధులు

ప్రజాశక్తి - వీరఘట్టం

గృహ సారధులు సంక్షేమ వారధులని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంతులు అన్నారు. గురువారం స్థానిక కోదండరామ కల్యాణ మండపంలో మా నమ్మకం నువ్వే జగనన్న అన్న కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ గెలుపు లక్ష్యంగా గృహ సారధులు, సచివాలయ కన్వీనర్లు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. నియోజకవర్గ పరిశీలకులు డి.జగన్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.గౌరమ్మ, ఎంపిపి డి.వెంకటరమనాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు జంపు కన్నతల్లి, ఉమామహేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కె.గోవిందరావు, కె.లీల ప్రసాదు, పట్టణ అధ్యక్షులు డి.లలిత కుమారి, సర్పంచులు, ఎంపీటీసీలు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

వంగరలోకి ప్రవేశించిన గజరాజుల గుంపు

వంగర : కొద్దిరోజులుగా పార్వతీపురం మన్యం జిల్లాలో సంచరిస్తూ ఆస్తి, ప్రాణనష్టం కలిగించిన ఏనుగుల గుంపు.. బుధవారం అర్ధరాత్రి వంగర మండలంలోకి ప్రవేశించింది. ఏనుగుల గుంపు సంచారంతో మండల ప్రజలు హడలిపోతున్నారు. బలిజిపేట మండలం నుంచి సువర్ణముఖి నదిని దాటుకుంటూ వంగర మండలంలోని కొప్పర కొండచాకరాపల్లి మీదుగా లక్ష్మింపేటకు చేరుకున్నాయి. రైతులు గంటేడ కృష్ణ, గంట్యాడ ఆదికి చెందిన ధాన్యం బస్తాలను ధ్వంసం చేశాయి. అక్కడ నుంచి తలగాంలో పొలాల్లోకి చేరుకొని మొక్కజొన్న పంటను నాశనం చేశాయి.

హైరిస్క్ గర్భిణులను గుర్తించాలి

ప్రజాశక్తి - పార్వతీపుం టౌన్

హై రిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాథరావు ఆదేశించారు. మాతృ మరణాలపై ఉప సంఘం సమీక్షా సమావేశం స్థానిక డిఎంహెచ్‌ఒ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో గురువారం జరిగింది. 2022 నవంబరు నుండి 2023 జనవరి వరకు జరిగిన మూడు మాతృ మరణాలపై సమీక్ష జరిపారు. తాడికొండ పిహెచ్‌సి పరిధి పెదఖర్జ, జియ్యమ్మవలస పిహెచ్‌సి పరిధి బాసంగి, సీతంపేట మండలం మర్రిపాడు పిహెచ్‌సి పరిధి రేగుల గూడలో మరణాలు జరిగాయని ఆయన పేర్కొన్నారు. హై రిస్క్ గర్భిణులను ముందుగా గుర్తించి ప్రసవానికి ముందుగానే ఆసుపత్రిలో చేర్చడం, స్త్రీ వైద్య నిపుణులతో పరీక్షలు విధిగా జరగాలని ఆదేశించారు. గర్భిణులు ఆరోగ్యం నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆశా, ఎఎన్.ఎంలను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మాతృ మరణాలు జరగకుండా వైద్య శాఖ అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. దీనిని సవాలుగా తీసుకొని పని చేయాలని వైద్య శాఖ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. వైద్య సేవలు అందించడంలో ఉన్న సంతృప్తిని ప్రతి ఒక్కరూ పొందాలని ఆయన సూచించారు. సమావేశంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ కె.విజయ పార్వతి, ఐటిడిఎ డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ జి.వెంకటరమణ, గైనకాలజిస్ట్ డాక్టర్ బి.కమల కుమారి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జగన్మోహన్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.వినోద్, వైద్య అధికారులు, పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ జగన్నాధరావు

స్కానింగ్ కేంద్రాల తనిఖీ

పార్వతీపురంలోని మాన్యశ్రీ, గంగా ఆసుపత్రుల స్కానింగ్ కేంద్రాలను డిటిసిఒ డాక్టర్ శ్యామ్ కుమార్ గురువారం తనిఖీ చేశారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, అవి జరపకూడదని, ఆడా మగా అని ముందుగా అడగటం, చెప్పడం నేరమని, విధిగా గోడ పత్రికలు అంటించాలని ఆయన పేర్కొన్నారు. స్కానింగ్ రికార్డ్స్, రిపోర్ట్స్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ డెమో సన్యాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్‌సిని ఉపసంహరించాలని నిరసన

ప్రజాశక్తి - పాలకొండ

మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులు, ఒప్పంద కార్మికులకు ఎసరు పెట్టే ఎపి ఎఫ్ఆర్‌సి విధానాన్ని వెంటనే ఉపసంహరించాలని మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ ఆధ్వర్యంలో నగర పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ కొత్త హాజరు విధానం ద్వారా మున్సిపల్ కార్మికుల్లో అత్యధికమంది చదువు రానివారని ఉన్నారని, వీరికి స్మార్ట్ ఫోన్లు కూడా లేవని, పైగా ప్రభుత్వ నిర్ణయించిన యాప్ డౌన్లోడ్ చేసుకుని పంపించ గలిగే అనుభవం అసలే లేనివారన్నారని అన్నారు. అటువంటి వారితో తమ ఫోటోలు తామే తీసుకొని హాజరు పంపించాలని ప్రభుత్వం నిర్ణయించడం కార్మికులను వీధుల పాలు చేయడమే అన్నారు. ఫోటో పంపకపోతే ఆ కార్మికుని హాజరు పడదని, జీతం కట్ అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కొత్త విధానం అమలైతే కార్మికులు బానిసల్లాగా పని చేయాల్సి ఉంటుందన్నారు. ఇంతటి ప్రమాదాన్ని తెచ్చి పెడుతున్న ఈ నూతన హాజరు విధానం మున్సిపల్ సిబ్బంది, ఒప్పంద కార్మికులకు ఉరుతాడు లాంటిదేనని, ఈ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పడాల భాస్కరరావు, చింతల సంజీవి, పడాల వేణు, సురేష్, రఘు, శ్రీదేవి, విమల పాల్గొన్నారు.

సాలూరు: మున్సిపాలిటీ లో పారిశుద్ధ్య విభాగం తో పాటు ఇతర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ముఖహాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ గురువారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన కార్మికులు ధర్నా నిర్వహించారు. ఇప్పటికే మున్సిపల్ పాలక వర్గానికి, కమిషనర్‌కి దీనిపై వినతులు అందజేశామని ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు టి.రాముడు,టి.శంకర్ చెప్పారు. ఈ విధానం రద్దు చేయకపోతే కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదొర్కొంటారని చెప్పారు. ముఖహాజరు నుంచి మినహాయింపు ఇవ్వకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ కోశాధికారి టి.ఇందు, మీడియా ఇంఛార్జి రవి పాల్గొన్నారు.

పాలకొండ మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలి

- 25 నుంచి కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు
- రైతుకు అండగా రాజకీయ పార్టీలు
- రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి - కలెక్టరేట్

రైతుల నుంచి తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలని, లేకుంటే ఈనెల 25 నుంచి కలెక్టరేట్ వద్ద రిలే నిరాహారదీక్షలు చేస్తామని పలు రాజకీయ పార్టీలు తీర్మానించారు. గురువారం స్థానిక ఎన్‌జిఒ హోంలో రాజకీయ పార్టీలు, రైతు కూలి సంఘాల నాయకుల ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అరకు పార్లమెంటు నియోజకవర్గ టిడిపి అధ్యక్షులు గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ ఫిబ్రవరి నెల గడుస్తున్నప్పటికీ రైతుల వద్ద ధాన్యం సేకరించకపోవడం పాలక పక్ష వైఫల్యానికి నిదర్శమని విమర్శించారు. తక్షణమే రైతుల వద్ద ఉన్న ధాన్యం సేకరించి రైతులను ఆదుకోకపోతే రాజకీయాలకు అతీతంగా రైతు పక్షాన జిల్లా ఉద్యమానికి సిద్ధమని హెచ్చరించారు. అరకు పార్లమెంట్ తెలుగు రైతు విభాగం అధ్యక్షులు డి.వెంకటనాయుడు, మాజీ ఎంపిపి జి.వెంకటనాయుడు మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటున్న వారు ధాన్యం సేకరణ చేయకపోవడంతో రైతులు రోడ్డున పడుతున్నారని విమర్శించారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శ్రీను నాయుడు మాట్లాడుతూ బస్తాలతో ధాన్యం మంచులో తడిసి ఎండకు గురై తరుగుతో పాటు, బస్తాలు పాడైపోతున్నాయని, ధాన్యం తరుగుదలకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. కావున ఐక్య ఉద్యమం ద్వారా రైతులకు అండగా నిలబడదామని పిలుపునిచ్చారు. జనసేన నాయకులు వంగల దాలినాయుడు మాట్లాడుతూ రైతులు కోసం చేసే ఉద్యమంలో మేము భాగస్వామి అవుతాము రైతుకు అండగా ఉంటామని తెలిపారు. అఖిల భారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.సంగం మాట్లాడుతూ గతం నెల పది రోజుల నుంచి ధాన్యం కొనండని ప్రభుత్వానికి రైతులు విన్నవించుకున్నా పట్టించుకునే నాధుడు లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రంజిత్ కుమార్ మాట్లాడుతూ ధాన్యం రైతుల చేస్తున్న ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆందోళనలో భాగస్వాములు అవుతామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు వెలమల సత్యనారాయణ, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి భాస్కరరావు, విశ్వేశ్వరరావు, బెజ్జిపురపు వెంకటరమణ, రైతులు కనపాక చౌదరినాయుడు అంపోలు చిన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

బొబ్బిలి : జగనన్న ఇళ్ల నిర్మాణానికి గొల్లపల్లిలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం జగనన్న ఇళ్లను మంజూరు చేసినట్లు చెప్పారు. ఇళ్లు మంజూరైన ప్రతిఒక్కరూ పనులు పూర్తి చేసి సొంతింటి కలను నిజం చేసుకోవాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు ప్రభుత్వం మంజూరు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాహుల్ నాయకత్వాన్ని బలపరచాలి

బొబ్బిలి : రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరచాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.వెంకటరమణ, పట్టణ అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు కోరారు. పట్టణంలో గురువారం 'చెయ్యి చెయ్యి కలుపుదాం.. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం' పేరుతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి హయాంలో దేశాభివృద్ధి లేదన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరించేందుకు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్యాకేజీ ఇవ్వకుండానే ఖాళీ చేయిస్తారా?

ప్రజాశక్తి -భోగాపురం

భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్వాసిత గ్రామమైన జమ్మయ్యపేటలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా ఇళ్లు ఖాళీచేయాలని చూడటం సరికాదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు.. అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారుల తీరుపై గురువారం సాయంత్రం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట టిడిపి ఆధ్వర్యాన నిర్వాసితులు నిరసన చేపట్టారు.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ బ్రోచర్ ఆవిష్కరణ

పార్వతీపురం టౌన్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏప్రిల్ 9న జరగనున్న మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను గురువారం స్థానిక అలజంగి జోగారావు మారుతి జిమ్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తొమ్మిది కేటగిరీల్లో 200 మంది వరకు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ పోటీల నిర్వాహణకు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

క్షేత్రస్థాయిలో రబీ సాగు పరిశీలన

మక్కువ : రబీ సీజన్లో నమోదు చేసిన ఇ- పంటలు నమోదులో ఎలాంటి లోపాలు ఉన్నాయా అన్నదానిపై వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె.లక్ష్మణబాబు మండలంలో క్షేత్ర పరిశీలన గురువారం చేపట్టారు. తూరుమామిడిలో సుమారు 34 మంది రైతులు రబీ పంటలు నమోదు చేసుకున్నారు. వీటిని పరిశీలించి క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, విఎఎ ఎస్.దివ్య, గ్రామ రెవెన్యూ అధికారి రామ, సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో పని పూర్తి చేసుకోవాలి

కురుపాం : సకాలంలో పని పూర్తి చేసుకొని లబ్ధిదారులకు సక్రమంగా పథకాలు అందుతాయని డిఆర్‌డిఎ పిడి పి.కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక వైయస్సార్ క్రాంతి పథక కార్యాలయం వద్ద సిసిలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైయస్సార్ క్రాంతి పథకం ద్వారా అందిస్తున్న పథకాల తీరు, స్వయం సహాయక సంఘాల పనితీరు, స్త్రీనిధి, సిఐఎఫ్, ఎఫ్‌పిఒ రికవరీలు తదితర వాటిపై సమీక్ష నిర్వహించారు. ప్రతి సిసి తనకు కేటాయించిన పనులను సకాలంలో పూర్తి చేసి లబ్ధిదారులకు పథకాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఎం కిశోర్, సిసిలు, మండల సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు చలపతిరావు, ప్రసాదరావు

గుమ్మలక్ష్మీపురం : యుటిఎఫ్ మండలం నూతన కార్యవర్గ ఎన్నికైంది. గౌరవ అధ్యక్షులుగా కొండగొర్రి భాస్కరరావు, అధ్యక్షులుగా మూటక చలపతిరావు, ప్రధాన కార్యదర్శిగా పత్తిక ప్రసాదరావు, మహిళ సహాధ్యక్షులుగా ఆరిక జగదీశ్వరి, పత్తిక శంకరరావు, కోశాధికారిగా డిసిహెచ్ నారాయణరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు టి.రమేష్ మాట్లాడుతూ సిపిస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి బిడ్డిక కూర్మారావు, మండల నాయకులు కద్రక ప్రకాశరావు, గౌరీశంకర్, మనోహర్, విజయకుమారి పాల్గొన్నారు.

ధర్మలక్ష్మీపురంలో వైద్య సేవలు

కురుపాం : మండలంలోని ధర్మలక్ష్మీపురంలో 104 ఆధ్వర్యంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.అభినవ్‌కుమార్ 52మందికి వైద్య సేవలందించారు. అనంతరం నీలకంఠాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 104 సిబ్బంది, వార్డెన్ పి.మల్లేష్, ఎంఎల్‌హెచ్‌పి రోషిని, పెచ్ఎ సునీత, నీలకంఠాపురం మహిళా పోలీస్ మీనక రవీనా, ఎఎన్ఎంలు జానకి, సుజాత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

హైరిస్క్ నంబరు ప్లేట్ తప్పనిసరి

సాలూరురూరల్ : ప్రతి వాహనానికి తప్పనిసరిగా హైరిస్క్ నెంబర్ ప్లేట్లు కలిగి ఉండాలని జిల్లా రవాణాధికారి మల్లికార్జునరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక బస్టాండ్ ఎదురుగా జాతీయ రహదారిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనానికి తప్పనిసరిగా హైరిస్క్ నెంబర్ ప్లేటును కలిగి ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదని, ఇన్సూరెన్స్ టాక్స్ అన్ని రకాలైన అనుమతులు ఉండాలని సూచించారు. లేకుంటే వాహనదారుడికి భారీగా జరిమానాను విధించబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సాలూరు రవాణా శాఖ అధికారులు బివిఎస్ ప్రసాద్, వరప్రసాద్, రవాణా శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలమాంబ హుండీ ఆదాయం రూ.11.93 లక్షలు

మక్కువ : మండలంలోని శంబర పోలమాంబ అమ్మవారి జాతరకు సంబంధించి మూడు, నాలుగు వారాలకు హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఈ సందర్భంగా రూ.11 లక్షల 93,917 ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ ఇఒ రాధాకృష్ణ తెలిపారు. సాలూరు గ్రూప్ దేవాలయ అధికారి ప్రసాదరావు ఆధ్వర్యంలో చదురుగుడిలో లెక్కింపు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మక్కువ ఎస్ఐ పైడ్రాజు ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

పార్వతీపురంటౌన్ : జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ శుక్ర వారం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎస్‌డివి రమణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక డాక్టర్ డివిఎంఎం పాఠశాలలో శుక్ర వారం ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రారంభిస్తారని చెప్పారు. సాయంత్రం జరిగే ముగింపు కార్యక్రమంలో ఇందులో జెసి ఒ.ఆనంద్ పాల్గొంటారని పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి అవశేషాలు

భామిని : మండలంలోని కొరమ కూడలి వద్ద కూర్మన్న చెరువు సమీపాన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బయటపడింది. అటుగా వెళ్తున్న కొంతమంది వ్యక్తులకు పుర్రె, ఎముకలు, దవడ, చీర, జాకెట్ కనిపించాయి. దీంతో వారు పోలీసులకు సమాచారం చేరడంతో బత్తిలి ఎస్ఐ వై.అమ్మన్నరావు, తహశీల్దార్ అప్పారావు ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నదీ తీరాన్ని పరిశీలించిన సబ్‌కలెక్టర్

వీరఘట్టం : మండలంలోని బిట్టువాడ వద్ద నాగావలి నదీతీరాన్ని గురువారం పాలకొండ సబ్‌కలెక్టర్ నూరల్ కమర్ పరిశీలించారు. ఇక్కడ ఎటువంటి అక్రమ జరుగుతుందానని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఇసుక అక్రమ రవాణా జరిగితే తమకు తెలపాలని సిబ్బందికి సూచించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో సర్వేర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ రీ సర్వే వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, ఆర్ఐల్లు లక్ష్మీ నాయుడు, శ్రీను గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-సీతానగరం

స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలను లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాం రాష్ట్ర పరిశీలన సభ్యులు ఎల్.రామకష్ణ, ఎం.రామకష్ణ, జయకష్ణ పరిశీలించారు. ఎల్ఐపిలో భాగంగా 6-8 తరగతులకు ఉపాధ్యాయుల బోధనాతీరు, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఇఒ జి.సూరిదేవుడు, పాఠశాల హెచ్ఎం ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

జియమ్మ వలస : పాఠశాలల పర్యవేక్షణలో భాగంగా రావాడ రామభద్రపురంలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమం పాఠశాలను ఎఎంఒ మోహన్ రాయుడు గురువారం పరిశీలించారు. టెన్త్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థుల శత శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎన్.తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న కేంద్ర కమిటీ సభ్యులు

పేరు గొప్పే.. పట్టించుకునే వారేరీ?

సమస్యల 'గుంప' సోమేశ్వర స్వామి ఆలయం

ప్రజాశక్తి - కొమరాడ

నాగావళి, జంఝావతి నదుల సంగమంలో వెలిసిన గుంప సోమేశ్వర స్వామి ఆలయానికి ఎంతో ప్రతిష్ట ఉంది. శివరాత్రి సందర్భంగా ప్రతి ఏటా ఈ ఆలయంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఆలయానికి శివరాత్రితో పాటు కార్తీక మాసంలో అత్యధికంగా భక్తుల రద్దీ ఉంటుంది. శని, సోమవారాల్లో ఒడిస్సా రాష్ట్రం పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సోమేశ్వర స్వామిని దర్శనం చేసుకుంటారు.

ప్రసిద్ధిగాంచిన ఈ ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది. అయినప్పటికీ ఆలయ అభివృద్ధికి పట్టించుకునే వారే లేకపోయారని ఈ ప్రాంత ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. వందల సంవత్సరాల్లో దూరాబాదాల నుంచి మామూలు వచ్చేలు చేసే తమ జోజులు నింపుకుంటున్నారు తప్ప కనీసం ఆలయానికి రంగులు వేసే నాథుడే కరువయ్యాడని ఈ ప్రాంత ప్రజల నుంచి ఆందోళన వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయంపై దేవదాయ శాఖ ఇఒ వద్ద ప్రస్తావించగా ఆలయానికి బడ్జెట్ లేదని అందుకే నామమాత్రంగా ఈ పనులు చేస్తున్నట్లు చెప్పడం విడ్డూరం. ఆఖరుకు భక్తుల దర్శనం కోసం లైన్లో ఉన్న సమయంలో ఎండ నుంచి విముక్తి పొందేందుకు ఏర్పాటు చేసిన టెంట్లు కూడా సక్రమంగా వేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాదైనా ఇబ్బందులేకుండా తాగు నీరు, టెంట్లు పూర్తిస్థాయిలో వేయాలని భక్తులు కోరుతున్నారు.

అధ్వానంగా రహదారి

సోమేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రహదారి పరమ అధ్వాన్నంగా తయారైంది. గతంలో కోటిపాం నుంచి ఆలయానికి వెళ్లే రహదారి కోసం నిధులు మంజూరు చేసి కొంతమేరకు ఖర్చు చేసినప్పటికీ ఇప్పుడు అది నిరుపయోగంగా మారింది. గంగిరేగువలస నుంచి రహదారి ఉన్నప్పటికీ పూర్తిగా గోతులమై ఏర్పడి ప్రయాణాలు చేసేందుకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో పార్వతీపురం నుంచి గంగిరేగువలస మీదుగా బస్సు సౌకర్యం ఉండేది. ఈ ఏడాది రోడ్డు బాగోకపోవడంతో బస్సులు నడిచే పరిస్థితి లేదు. దీంతో భక్తులు ఆలయానికి వెళ్లాలంటే ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి వచ్చింది.

ఆలయం ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

పారమ్మకొండ యాత్రకు విస్తృత ఏర్పాట్లు

సాలూరు: పాచిపెంట మండలం చీపురువలస సమీపాన వెలసిన పారమ్మకొండ జాతర విజయవంతానికి ఆలయ కమిటీ సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రతిఏటా మహాశివరాత్రి సందర్భంగా జరుగుతున్న జాతరకు సుమారు లక్షమంది వరకు భక్తులు రావొచ్చని అంచనా. అనేక దశాబ్దాలుగా సాగుతున్న ఈ జాతరకు జిల్లాతో పాటు ఒడిశా, ఛత్తీస్గఢ్ నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు, తాగునీటి సరఫరా వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

జాతర విజయవంతానికి చర్యలు
ప్రసాద్, దేవాదాయశాఖ ఇఒ

ఈఏడాది పారమ్మ కొండ జాతర విజయవంతానికి చర్యలు చేపడుతున్నాం, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు, తాగునీటి సరఫరా చేస్తున్నాం, భక్తుల రవాణా కోసం ఆర్టీసీ అధికారులతో సంప్రదించాం, సాలూరు హైందవ ధర్మసేన సభ్యులు, స్థానిక గిరిజన పెద్దల సహకారంతో

జాతర విజయవంతానికి కృషి చేస్తున్నాం

ప్రత్యేక బస్సులు
భాస్కరరెడ్డి, డిఎం, ఆర్‌టిసి సాలూరు డిపో

మహాశివరాత్రి సందర్భంగా పారమ్మ కొండపై జరిగే జాతరకు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని 35 ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం, సాలూరు నుంచి పారమ్మ కొండ వరకు బస్సు చార్జీ కింద రూ.20గా నిర్ణయించాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా రవాణా సౌకర్యం కల్పిస్తున్నాం.

ముస్తాబవుతున్న కాశీ విశ్వేశ్వరాలయం

పార్వతీపురంరూరల్ : జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న అడ్డాపుశిలలో మూడుశతాబ్దాల చరిత్ర గలిగిన ప్రముఖ శైవక్షేత్రం కాశీవిశ్వేశ్వర ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైంది. శివరాత్రి సందర్భంగా జిల్లాలోని పరిసర ప్రాంతాల నుండి వచ్చే భక్తుల సౌకర్యార్థం గ్రామస్థులు ఏర్పాట్లు చేసుస్తున్నారు. ఇక్కడి కొండగుహలో విశ్వేశ్వరునితో పాటు, ఆలయప్రాంగణంలో సీతారామ, సత్యనారాయణ, జగన్నాథ, ఆంజనేయ ఆలయాలను కూడా భక్తులు దర్శించేందుకు ఏర్పాటు చేయబడ్డాయని అభివృద్ధి కమిటీ చైర్మన్, అక్కేన సుందరనాయుడు తెలిపారు:నివారం ఆర్ధరాత్రికి జరిగే లింగోద్భవ పూజలకోసం విస్తృతంగా ఏర్పాటు జరిగాయని కమిటీ చైర్మన్ తెలిపారు.అలాగే మండలంలోని పలుగ్రామాల్లో గల శైవాలయాలను అందంగా ముస్తాబు చేస్తున్నారు. పెదబొండపల్లి రామలింగేశ్వర దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయడమే కాకుండా, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నటు నిర్వాహకులు తెలిపారు. అలాగే నర్సిపురంలోని కాశీఅన్నపూర్ణేశ్వర దేవాలయం, బందలుప్పి బాలనాగేశ్వర ఆలయం, తాళ్లబురిడి, పిట్టలవలస, గ్రామాల్లోనూ ఏర్పాటు చేస్తున్నారు.



ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజారోగ్యం మెరుగు : కలెక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో గ్రామీణ ప్రాంతాల్లో ఇంటివద్దకే వైద్యం అందించి ప్రజా ఆరోగ్యం మెరుగు పరిచేందుకు ప్రభుత్వం కషి చేస్తుందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. మండలంలోని చలివేంద్రిలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఎంత మందికి వైద్యం అందించింది, ఏ ఏ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నది, అందుబాటులో ఎంత మేరకు మందులు నిల్వ ఉన్నవి అనే విషయాలను వైద్యులను అడిగితెలుసుకున్నారు. గ్రామంలో ఇప్పటివరకు ఎఎన్ఎంలు నిర్వహించిన సిడి, ఎన్ సి డి సర్వే వివరాలను పరిశీలించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరం వద్ద రోగులకు అందుతున్న వైద్య సేవలపై అడిగి సంతప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వైద్య పరీక్షలకు ముందుకురావాలని, తద్వారా దీర్ఘకాలిక వ్యాధులు, సోకిన జబ్బులను గుర్తించి సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించవచ్చన్నారు. ప్రజలు ఆరోగ్యం శ్రద్ధవహించాలని సూచించారు. ఆరోగ్యకర గ్రామాలుగా రూపొందించేందుకు అందరిపైనా బాధ్యత ఉందని గుర్తుచేశారు. అనంతరం నడిమికెళ్ళ గ్రామ అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రం పరిధిలోని ఎంతమంది చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికహారం అందిస్తున్నది అడిగి తెలుసుకున్నారు. రక్తహీనతతో బాధపడుతున్న అభూరి రామలక్ష్మికి పౌష్టికాహారం అందివ్వడంతో రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయి పెరిగిందని తెలపడంతో అంగన్వాడీ కేంద్రం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్వాడీ కార్యకర్తలు రక్తహీనత వలన కలిగే ఇబ్బందులను విస్తతంగా అవహన కల్పించాలని అన్నారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. సచివాలయం పరిధిలో అందుతున్న సేవలపై ఆరా తీశారు.

సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ధాన్యం కొనుగోలుకు చర్యలు

కళ్లాల్లో ధాన్యం బస్తాలున్నాయని, వాటిని కొనుగోలు చేసి న్యాయం చేయాలని చలివేంద్రిలో రైతులు జిల్లా కలెక్టర్‌ను కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇప్పటికే 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అనుమతి మంజూరు చేసిందని ఆయన వివరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. బి.జగన్నాథ రావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ పార్వతి, ప్రోగ్రాం అధికారి డా.ఎం.వినోద్, ఇన్‌ఛార్జ్ జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయ గౌరి, తహశీల్దార్ సిహెచ్.సత్యనారాయణ, సిఎస్‌డిటి ఇ.మల్లేశ్వర రావు, వైద్య సిబ్బంది, గ్రామ సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పునశ్చరణ తరగతులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లాలోని బిసి సంక్షేమ శాఖ వసతి గృహాల్లో పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలను ఉద్దేశించి పార్వతీపురం ఎబిసిడబ్ల్యుఒ ఎస్.సాంబమూర్తి ఆధ్వర్యంలో పునశ్చరణ శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి రమణ, డిబిసి డబ్ల్యుఒ ఎస్.కృష్ణ పాల్గొన్నారు. టెన్త్‌లో వివిధ మాధ్యమాలకు సంబంధించి గురువారం పార్వతీపురం ప్రభుత్వ బ్రాంచ్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో సాయంత్రం వరకు విద్యార్థులకు పలు సూచనలు, గణిత శాస్త్రంలో మెళకువలకు సంబంధించిన శిక్షణా తరగతులు విద్యార్థులకు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బిసి సంక్షేమాధికారులు మాట్లాడుతూ బిసి సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని, జిల్లాకు, విద్యార్థులు తల్లిదండ్రులకు, మంచి పేరు విద్యార్థులు తీసుకొచ్చి ఉన్నత స్థాయికి విద్యార్థులు చేరుకోవాలని సూచించారు. ఇప్పటికే వసతి గృహాల్లో టెన్త్ విద్యార్థులు చదువుకునేందుకు పాఠశాల అనంతరం వసతి గృహాల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిధిలో గల వసతి గృహాల వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సూక్ష్మ ప్రణాళిక ద్వారా చెరువుల అభివృద్ధి

పార్వతీపురంరూరల్+ మండలంలోని ఎమ్మార్‌నగరం రామయ్య చెరువును జీవనోపాధుల అభివృద్ధి పథకంలో భాగంగా అవృవృద్ధి చేస్తున్నట్లు జలవనురుల శాఖ జెఇ తిరుపతిరావు తెలిపారు. గురువారం ఎమ్మార్‌నగరంలో సర్పంచ్ వంగపండుత్రినాథ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జైకా నిధులతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఈ పనులను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని వారు ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో ఎపిడి మురళీకృష్ణ, ఎంపిటిసి బడే రామారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి - భామిని

ప్రస్తుత పరిస్థితుల్లో టిడిపితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ నిమ్మక జయకృష్ణ తెలిపారు. మండలంలోని వడ్డంగి, బొమ్మికలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు, పిల్లలు భవిష్యత్తు దృష్ట్యా ప్రతి ఒక్కరూ టిడిపి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండలశాఖ అధ్యక్షులు భోగాపురం రవినాయుడు, ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరరావు, మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, రామారావు, శేషగిరి, కొండలరావు, సింహాద్రి నాయుడు, పోలినాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలను ఎంపిడిఒ పరిశీలన

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని డోకిశిల గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల, వసతి గృహాలను గురువారం ఎంపిడిఒ అకిబ్‌జావేద్ పరిశీలించారు. ఇటీవలన వసతి గృహాల్లో విద్యార్థినిల వరుస మరణాల నేపథ్యంలో వసతి గృహాల్లోని సౌకర్యాలు, వైద్యసేవలు, తరగతి గదుల అందుబాటును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల వసతి గృహసంరక్షులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఎప్పటికప్పుడు ఆరోగ్యపరీక్షలు నిర్వహించాలని, అలాగే ఎలాంటి వైద్యసేవలు అవసరమైనా వెంటనే స్పందించాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో డోకిశిల వైద్యాదికారి ఐశ్వర్య, వార్డెన్ రమేష్, ప్రధానోపాధ్యాయులు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో అన్నదానం

భామిని : మండల కేంద్రంలోని శ్రీ ఉమా రామలింగేశరస్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం భక్తులుకు, గ్రామస్తులకు అన్నదానం నిర్వహించారు. శుక్రవారం వంశధార నదిలో నిర్వహించే చక్ర తీర్ధ స్థానాలకు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని, చక్రతీర్థ స్నానం అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ ఉంటుందని తెలిపారు.

కాలిపోతున్న జీడితోట

అగ్నికి ఆహుతైన జీడి తోట

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మేజర్ పంచాయతీ కురుపాం పరిధిలో గల టేఖరకండి సమీపంలో చందక కూర్మినాయుడు చెందిన నాలుగు ఎకరాల జీడి తోట గురువారం సాయంత్రం అగ్నికి ఆహుతైయింది. ఈ తోట సమీపానున్న జీడి రైతులు సకాలంలో స్పందించడం వల్ల మరో 20 ఎకరాలు జీడి, నీలగిరి, టేకు మొక్కలకు అగ్ని ముప్పు తప్పింది. దీంతో చుట్టుపక్కల ఉన్న రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా కూర్మినాయుడు మాట్లాడుతూ కొన్నేళ్లుగా కష్టపడి సాగు చేసిన మొక్కలు గతేడాది పువ్వు పిందె సమయంలో తెల్లదోమ వల్ల ఆశించిన స్థాయిలో పంట రాలేదన్నారు. ఈ సంవత్సరం పువ్వు బాగా పూసి పింజ బాగా కట్టి పంట చేతికి అందుతాదనే సమయంలో ఇలా అగ్నికి ఆహుతవ్వడం తమ కష్టం బుగ్గిపాలైందని కన్నీరు మున్నీరయ్యారు. ప్రభుత్వం స్పందించి పంట నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు.

సమస్యలు చెప్పకోవడానికే అవకాశం ఇవ్వరా?

ప్రజాశక్తి కొమరాడ

ధాన్యం కొనుగోలులో ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులకు రైతులు చెప్పుకోవడానికి కనీస అవకాశం ఇవ్వడం లేదని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కొమరాడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు తమ సమస్యలు చెప్పుకోవడానికి సివిల్ సప్లై డిఎం కార్యాలయానికి వస్తే రెండు గంటల పాటు బయటే ఉంచడం దారుణమన్నారు. వీడియో కాన్ఫడెన్స్‌లో డిఎం ఉంటే అధికార పార్టీ నాయకులకు మాత్రమే మాట్లాడ్డానికి అనుమతి ఇచ్చి మిగిలిన వారితో మాట్లాడకపోవడం దారుణమన్నారు. రైతుల వద్ద ఉన్న మిగులు ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రాత్రివేళ రైతులు కాపలా కాస్తున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. కొమరాడతో పాటు సరాపాడు, రామభద్రపురం, చోళ్లపదం, పరుశరాంపురం, సివిని, గంగిరేగివలస, కోటిపాం, గుమడ, సీతమాంబపురంతో పాటు అనేక గ్రామాల్లో ఇంకా ధాన్యం ఉన్నాయన్నారు. మిగులు ధాన్యాన్ని వెంటనే కొంటామని కొద్దిరోజుల క్రితం అధికారులు గ్రామాల్లో పర్యటించి ఏ రైతు వద్ద ఎన్ని ధాన్యం ఉన్నాయనే విషయాన్ని స్పష్టంగా తెలుసుకున్నా నేటికీ ధాన్యం కొనుగోలు చేయలేదన్నారు. ఇప్పటికైనా సివిల్ సప్లై డిఎం స్పందించి రైతులు వద్ద ఉన్న మిగులు ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులకు అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే నేటికి 43 రోజులైనా ధాన్యం అమ్మిన డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేయలేదని, వెంటనే రైతులు బ్యాంకుల ఖాతాలో జమ చేయాలని కోరారు. లేకుంటే సివిల్ సప్లై డిఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

డిఇసి మాత్రలు పంపిణీ

జియ్యమ్మవలస : నులిపురుగులు, బోధ వ్యాధి నియంత్రణలో భాగంగా రావాడ రామభద్రపురంలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు అక్కడి పిహెచ్‌సి వైద్య సిబ్బంది ఆల్బెండజోల్, డిఇసి మాత్రలను గురువారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎన్.తిరుపతి, వైద్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఒటిపిలు ఎవరికీ చెప్పొద్దు

పార్వతీపురంటౌన్ : బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వన్ టైం పాస్ వర్డ్ (ఒటిపి)లను ఎవరికీ చెప్పరాదని రిజర్వ్ బ్యాంకు సహాయ జనరల్ మేనేజర్ ఎ.నాగప్రవీణ్ అన్నారు. ఎటిఎం కార్డుల పాస్ వర్డ్, ఆన్ లైన్ బ్యాంకింగ్‌లో ఒటిపిలు గోప్యంగా (ఎవరికి తెలియకుండా) ఉంచాలని చెప్పారు. ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో నాగ ప్రవీణ్ పాల్గొన్నారు. పొదుపు చేయడం అలవర్చుకోవాలని, అది భవిష్యత్తు అవసరాలకు తోడ్పడుతుందని, విద్యార్థిగా పొదుపు మొదలు పెట్టాలని సూచించారు. ప్రస్తుతం ఆర్థిక నేరాలు జరుగుతున్నాయని, వాటిపట్ల స్పష్టమైన అవగాహన ఉండాలని కోరారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ జె.ఎల్.ఎన్ మూర్తి, ఎస్.బి.ఐ చీఫ్ మేనేజర్ రవి శంకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు..

కెజిబివి పరిశీలన

కురుపాం : టెన్త్ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణతకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధి హామీ ఎపిడి, కెజిబివి పదో తరగతి ప్రత్యేక అధికారి పి.చంద్రమ్మ అన్నారు. గురువారం స్థానిక కెజిబివి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో రికార్డులను, విద్యార్థుల హాజరు పట్టిక, నాడు నేడు పనులు, కిచెన్ గార్డెన్, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. టెన్త్, 9వ తరగతి విద్యార్థుల తరగతి గదులకు వెళ్లి వారి విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణతకు ఇప్పటి నుంచే ప్రణాళికా బద్ధంగా చదివించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కెజిబివి ప్రత్యేక అధికారిని ఐ.కిరణ్ కుమారి, ఉపాధి హామీ ఎపిఒ పి.బావాజీ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులను నిలదీత

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని వివిధ సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపిపి జి.నాగమణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పెద్దింపేట ఎంపిటిసి సభ్యులు మొదిలి సాంబమూర్తి తమ గ్రామంలో జగనన్న కాలనీ మార్చిలో ప్రారంభం కాబోతుందని, అక్కడ నీటి సమస్య ఉందని, ఒకే ఒక్క బోరులో పనిచేస్తుందని, కావున సమస్య పరిష్కరించాలని కోరారు. తమ గ్రామంలోకి విద్యుత్ సరఫరా పొలాల మార్గం ద్వారా వస్తుందని ఎప్పుడైనా విద్యుత్‌కు అంతరాయం కలిగితే పొలాల్లో డొంకల మధ్య వెళ్లాల్సి వస్తోందని, కావున విద్యుత్తు స్తంభాలను ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేస్తే సమస్య కొంతవరకు మెరుగుపడుతుందని ఎఇ సింహాచలంను కోరారు. వెంగాపురం ఎంపిటిసి సభ్యులు మురళి గ్రామంలోని మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు. బర్లి ఎంపిటిసి సభ్యులు తమ గ్రామంలో బోరు ఏర్పాటు చేయాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లింపుపై కొద్దిసేపు సర్పంచులకు, ఎంపిటివులకు మధ్య రసాభాస కొనసాగింది. గ్రీన్ అంబాసిడర్లతో ఎంపిడిఒ సిబ్బంది పని చేయించుకోవాలని, జీతాలు వారే చెల్లించాలని సర్పంచులు ఎంపిడిఒ స్పష్టం చేశారు. దీనికి ఎంపిడిఒ స్పందిస్తూ వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో మంచినీటి సమస్యను గుర్తించి బోర్ మరమ్మతులు చేయించాలని, ఉగాది పండుగకు మండలంలోని రెండువేల ఇళ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉండాలని, ఇందుకు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు సహకరించాలని ఎంపిడిఒ భానుమూర్తి కోరారు. విద్యుత్ అసౌకర్యం కలగకుండా చూడాలని జెడ్‌పిటిసి అధికారులను ఆదేశించారు. ఎన్నిక కోడ్ అమల్లో ఉండడం వల్ల ప్రధాన అంశాలపై చర్చించి సమావేశాన్ని ముగించారు. సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎ.రవి కుమార్, వైస్ ఎంపిపి వి.సాయిరాం, వివిధశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

అరగంటలో ముగిసిన సర్వసభ్య సమావేశం

పాచిపెంట : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండడంతో ఎంపిపి బి.ప్రమీల అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం అరగంటలో ముగిసింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ సందర్భంగా సర్వసభ్య సమావేశం అరగంటలో ముగించాలని కలెక్టర్ ఆదేశాలు ఉన్నట్లు సభ్యులకు తెలిపారు. సమస్యలు తెలియజేయాలంటే లిఖితపూర్వకంగా సభ్యులు తెలియజేయాలని తెలిపారు. సమావేశానికి గైరాజరైన అధికారులకు నోటీసులు ఇవ్వాలని కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌కు ఎంపిడిఒ ఆదేశించారు. సమావేశంలో జెడ్‌పి వైస్‌చైర్మన్ కె.సింహాచలం, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి బలగ రవణమ్మ అధ్యక్షతన గురువారం జరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో చర్చలు లేకుండా సమావేశాన్ని ముగిసినట్టు ఎంపిపి ప్రకటన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసి మామిడి బాబ్జీ, ఎంపిడిఒ కృష్ణమహేష్ రెడ్డి, ఇఒపిఆర్‌డి కెకె వర్మ, మండల పరిషత్ పరిపాలన అధికారి ప్రసాద్, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

బలిజిపేట : మండల సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు